## క్లుప్తంగా

### డీవైఎఫ్ఐ నేతల సంబరాలు



నెల్లూరు(వీఆర్సీసెంటర్): టీ – 20 క్రికెట్ వరల్డ్ కప్‌లో భారత్ విజయాన్ని పురస్కరించుకొని నగరంలోని పూలే విగ్రహ సెంటర్‌లో డీవైఎఫ్ఐ ఆధ్వర్యంలో సంబరాలను ఆదివారం జరుపుకొన్నారు. న్యాయవాది అంకిరెడ్డి జనార్దన్‌రెడ్డితో కలిసి కేక్‌ను కట్ చేశారు. ఈ సందర్భంగా డీవైఎఫ్ఐ నగరాధ్యక్షుడు నరసింహ మాట్లాడారు. గ్రామీణ క్రీడాకారులను రాష్ట్ర ప్రభుత్వం ప్రోత్సహించాలని కోరారు. డీవైఎఫ్ఐ నగర ఉపాధ్యక్షుడు జగదీష్, శేఖర్, బాబు, ఫయాజ్, సాయిగణేష్, సురేంద్ర, కుమార్ తదితరులు పాల్గొన్నారు.

### వాకర్స్‌కు సత్కారం



నెల్లూరు(బృందావనం): పాదలకూరు రోడ్డులోని జెడ్పీ హైస్కూల్లో వివిధ సేవా కార్యక్రమాలను జెడ్పీ వాకర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా వాకర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు మెట్టు సుధాకర్‌రెడ్డి మాట్లాడారు. రానున్న రోజుల్లో సేవా కార్యక్రమాలను విస్తృతం చేసేందుకు కృషి చేస్తామని చెప్పారు. తొలుత వాకర్స్‌ను సత్కరించారు. అసోసియేషన్ కోశాధికారి చెంచయ్య, కృష్ణయ్య, అనంతరావు, మోహన్‌రావు, రాజగోపాల్, వెంకటేశ్వర్లు, మేరీ బ్లెస్సింగ్టన్, ఎస్తేర్ రాణి తదితరులు పాల్గొన్నారు.

### గరుడ వాహనంపై మహావిష్ణు విహారం



నెల్లూరు(బృందావనం): నగరంలోని అయ్యప్ప దేవస్థాన ప్రాంగణంలో గల మహాలక్ష్మి గోదా సమేత గురువాయూర్ మహావిష్ణు ఆలయంలో నిర్వహిస్తున్న బ్రహ్మోత్సవాలను పురస్కరించుకొని గరుడ వాహనంపై స్వామివారు ఆదివారం విహరించారు. భద్రాచలంలోని సీతారామచంద్రస్వామి దేవస్థాన స్థానాచార్యుడు కొమాండూరు ఇళయవిల్లి స్థలశాయి ఆధ్వర్యంలో పూజా కార్యక్రమాలను నిర్వహించారు. ఉభయకర్తలుగా మేడికొండ పుష్ప, మేడికొండ పద్మమోహన్, స్నేహ కుటుంబసభ్యులు వ్యవహరించారు. కాగా స్వామివారి తిరు కల్యాణమహోత్సవాన్ని సోమవారం ఉదయం 10.30కు నిర్వహించనున్నారు. అయ్యప్ప సేవా సమాజ అధ్యక్ష, కార్యదర్శులు శేషగిరిరావు, వెంకటరత్నం, కోశాధికారి రత్నయ్య, మోహన్‌రావు, శంకరన్, జగన్నాథం తదితరులు పర్యవేక్షించారు.

### పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత



నెల్లూరు(వీఆర్సీసెంటర్): పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత అని ఆంధ్రప్రదేశ్ స్వచ్ఛంద సేవా సంస్థల సభ్యులు పేర్కొన్నారు. స్వచ్ఛభారత్ – పర్యావరణ పరిరక్షణ మన బాధ్యత అనే నినాదంతో మైపాడు బీచ్‌లో అవగాహన కార్యక్రమాన్ని సంస్థ ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా సేవా సంస్థల సభ్యుడు రమేష్ మాట్లాడారు. ప్లాస్టిక్ బాటిళ్లు, కవర్లను ఎక్కడపడితే అక్కడ వేయొద్దని కోరారు. అనంతరం బీచ్‌లో పడి ఉన్న వ్యర్థ, ప్లాస్టిక్ వస్తువులను సేకరించి డంపింగ్ యార్డ్‌కు తరలించారు. ఆయుర్వేద వైద్యురాలు సువర్ణకుమారి, స్వచ్ఛంద సేవా సంస్థల నిర్వాహకులు మాధవి, సుధాలక్ష్మి, వెంకటేశ్వర్లు, రమేష్‌రాజ్, సురేంద్ర, శశికిరణ్, కార్తికేయ తదితరులు పాల్గొన్నారు.

### కృష్ణ కథామృత భాగవత సప్తాహం

నెల్లూరు(బృందావనం): బాలాజీనగర్‌లోని సీతారామస్వామి మందిరంలో కృష్ణ కథామృత భాగవత సప్తాహాన్ని నిర్వహిస్తున్నారు. ఇందులో భాగంగా శతావధాని డాక్టర్ సూరం శ్రీనివాసులు ఆదివారం ఉపన్యసించారు. అనంతరం ఆయన్ను సన్మానించారు. సభాపోషకుడిగా చక్కిరాల జయప్రసాద్ వ్యవహరించారు. పద్యసారస్వత పరిషత్ నిర్వాహకులు పోలవరపు లక్ష్మీనరసింహరావు, చీమకుర్తి వెంకటేశ్వరరావు, అగస్త్యరాజు సుబ్బారావు, సత్యనారాయణ, సమయానందనాథస్వామి, కోట శ్రీరామ్మూర్తి, రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

# నో సిగ్నల్..!

- సెల్ టవర్లున్నా అందని వైనం
- రేషన్, పింఛన్ మొదలుకొని అన్నింటికీ ఇబ్బందులే
- వినియోగదారులకు తప్పని అవస్థ



నార్తురాజుపాళెంలోని సెల్ టవర్

కొడవలూరు: ప్రస్తుతం మొబైల్ ఫోన్లకు ఎంత ప్రాధాన్యం ఉందో అందరికీ తెలిసిందే. ఇంట్లో టీవీ, ఫ్రిజ్, మిక్సీ, ఏసీల్లాంటివి లేకపోయినా సెల్‌ఫోన్ మాత్రం తప్పక ఉంటుంది. ఆధార్, బ్యాంక్ సేవలు, మొబైల్ బ్యాంకింగ్‌కు సెల్ ఫోన్ నంబర్‌ను విధిగా అడుగుతున్నారంటే వీటి ప్రాధాన్యం ఏమిటో అర్థం చేసుకోవచ్చు. అయితే గ్రామీణ ప్రాంతాల్లో సిగ్నళ్లు అందకపోవడం సమస్యగా మారింది. టవర్లు తగినంత లేకపోవడం, ఉన్నా నిర్వహణ లోపించడం తదితర కారణాలతో సిగ్నళ్లు అందక వినియోగదారులకు ఇబ్బందులు తప్పడంలేదు.

**శివారు గ్రామాల్లో తప్పని పాట్లు**

మండలంలో 24 పంచాయతీలు, 90 గ్రామాలున్నాయి. వీటిలో తక్కువ శాతం గ్రామాలే జాతీయ రహదారికి పక్కన ఉండగా, మిగిలినవన్నీ బాగా దూరంగా ఉన్నాయి. కొత్తవంగల్లు, పాత వంగల్లు, పెమ్మారెడ్డిపాళెం, మిక్కిలింపేట, ఆలూరుపాడు, మానేగుంటపాడు, తలమంచి, దామేగుంట, రామాపురం శివారు గ్రామాలుగా ఉన్నాయి. ఈ గ్రామాల్లో సెల్‌ఫోన్‌ను వినియోగించాలంటే చుక్కలు కనిపిస్తున్నాయి. సిగ్నళ్లు అందక తీవ్ర ఇబ్బందులు ఎదురవుతున్నాయి. సమస్యను కంపెనీలకు వినియోగదారులు తెలియజేసినా ప్రయోజనం లభించడంలేదు.

**అన్నింటికీ అగచాట్లే**

సిగ్నల్ బాగుంటే తప్ప ఆయా గ్రామాల్లో రేషన్ సరుకులు పొందే పరిస్థితి లేదు. ఒక్కోసారి గంట వేచి ఉన్నా సిగ్నళ్లు అందక నిత్యావసరాలు పొందలేకపోతున్నారు. మళ్లీ మళ్లీ రావాల్సిన పరిస్థితి నెలకొంటోంది. బ్యాంక్ సేవలకు సంబంధించి వివిధ రకాల యాప్‌లను ఉపయోగిస్తుండటం సర్వసాధారణమైంది. వీటి వినియోగంలో ఓటీపీ తప్పనిసరవుతోంది. సిగ్నళ్లు అందని కారణంగా ఓటీపీలు రాక ఇబ్బందులు ఎదురవుతున్నాయి. ఆధార్ సేవలు పొందడంలోనూ ఇదే సమస్య వేధిస్తోంది.

**పింఛన్ల పంపిణీలో పరేషాన్**

సామాజిక పింఛన్ల పంపిణీ సిగ్నల్ అందని కారణంగా ప్రహసనంలా మారుతోంది. ఒకటో తేదీనే ఇంటి వద్దకు సచివాలయ సిబ్బంది వచ్చి పింఛన్‌ను ఇవ్వాలన్నా సిగ్నల్ సమస్యతో అందజేయలేని పరిస్థితి నెలకొంటోంది. ఒక్కరికి ఇచ్చేందుకే గంట సమయం తీసుకుంటున్న సందర్భాలూ చోటు చేసుకొంటున్నాయి. ఫలితంగా నిర్దేశించిన సమయానికి పింఛన్లు ఇవ్వలేని పరిస్థితి ఎదురవుతోంది. కొత్త టవర్లను ఏర్పాటు చేయడంతో పాటు ఎక్కువ వినియోగదారులున్న ప్రాంతాల్లో సిగ్నల్ ఫ్రీక్వెన్సీని పెంచాలని పలువురు కోరుతున్నారు.

**వ్యాపార లావాదేవీలకు ఆటంకం**



బెంగళూరు, హైదరాబాద్‌లో రియల్ ఎస్టేట్ వ్యాపారం చేస్తుంటా. స్వగ్రామానికి వచ్చినప్పుడు సిగ్నల్ అందని కారణంగా తీవ్ర ఇబ్బంది పడుతున్నా. ఫోన్ ద్వారా నగదు లావాదేవీల కోసం జాతీయ రహదారి వద్దకు రావాల్సి వస్తోంది. అత్యవసర అంశాలపై మాట్లాడాలన్నా స్పష్టత ఉండటంలేదు.

– సుబ్బరామిరెడ్డి, మానేగుంటపాడు, కొడవలూరు

**ఇబ్బందులు తప్పడంలేదు**



ఎరువులు, పురుగు మందులు కావాలంటే దుకాణాలకు సహాయకులను పంపి నగదును ఫోన్ ద్వారా చెల్లిస్తుంటాం. ఈ సమయంలో సిగ్నళ్లు అందక పేమెంట్ సకాలంలో చేయలేక అవసరాలు తీర్చుకోవడంలో జాప్యం జరుగుతోంది. పొలంలో ఉన్నప్పుడు ఫోన్లో మాట్లాడటం కష్టంగా మారుతోంది.

– మల్లికార్జున, రైతు, వెంకన్నపురం, కొడవలూరు

### పులి వాహనంపై రామలింగేశ్వరుడు



విడవలూరు: మండలంలోని రామతీర్థంలో వెలసిన కామాక్షిదేవి సమేత రామలింగేశ్వర స్వామి దేవస్థానంలో బ్రహ్మోత్సవాలను కనుల పండువగా నిర్వహిస్తున్నారు. ఇందులో భాగంగా స్వామివారు పులివాహనంపై ఆదివారం రాత్రి దర్శనమిచ్చారు. అనంతరం గ్రామోత్సవాన్ని వేడుకగా జరిపారు. కోలాట ప్రదర్శన, సాంస్కృతిక కార్యక్రమాలను ఏర్పాటు చేశారు. ఈఓ రామకృష్ణ, అర్చకుడు శ్రీకాంత్‌శర్మ వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

### ఆలయాభివృద్ధికి ఎంతో కృషి

నెల్లూరు(బృందావనం): మూలాపేటలోని భువనేశ్వరి సమేత మూలస్థానేశ్వరస్వామి దేవస్థాన ఈఓగా ఆరంబాకం వేణుగోపాల్ ఆలయాభివృద్ధికి ఎంతో కృషి చేశారని డిప్యూటీ మేయర్ రూప్‌కుమార్‌యాదవ్ కొనియాడారు. ఆయన ఉద్యోగ విరమణ కార్యక్రమాన్ని ఆదివారం నిర్వహించారు. దేవదాయ శాఖ జిల్లా అధికారి శ్రీనివాసరావు, కోటంరెడ్డి శ్రీనివాసులురెడ్డి, లోకిరెడ్డి వెంకటేశ్వరరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## వెంకటరాజు సేవలు ఎనలేనివి



వెంకటరాజు దంపతులకు సత్కారం

నెల్లూరు (టౌన్): ఉపాధ్యాయుడిగా వెంకటరాజు అందించిన సేవలు ఎనలేనివని ఎమ్మెల్సీ చంద్రశేఖర్‌రెడ్డి, పీఆర్టీయూ రాష్ట్ర నేతలు కృష్ణయ్య, గిరిప్రసాద్ తెలిపారు. దర్గామిట్టలోని కిలారి తిరుపతయ్యనాయుడు కల్యాణ మండపంలో వెంకటరాజు ఉద్యోగ విరమణ కార్యక్రమాన్ని ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా వెంకటరాజు దంపతులను సత్కరించారు. కార్యక్రమంలో కరుణానిధి, మూర్తి, శ్రీనివాసరాజు, నాగేంద్రకుమార్, నాటకం తిరుమలయ్య, చేవూరు విజయమోహన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

### పోలేరమ్మకు ప్రత్యేక పూజలు



మనుబోలు: మనుబోలులోని కోదండరామపురం దేవాంగుల వీధిలో కొలువైన పోలేరమ్మ ఆలయంలో అమ్మవారికి ప్రత్యేక పూజలను ఆదివారం నిర్వహించారు. పంచామృతాభిషేకాన్ని నిర్వహించి ప్రత్యేకంగా అలంకరించారు. భక్తులకు తీర్థప్రసాదాలను అందజేశారు. అర్చకుడు శ్రీనివాసులు ఆధ్వర్యంలో పూజలు చేశారు. ఉభయకర్తలుగా పసుపులేటి శ్రీనివాసులు, విజయలక్ష్మి దంపతులు వ్యవహరించారు.

### గాయపడిన వ్యక్తి మృతి



మనుబోలు: గుర్తుతెలియని వాహనం ఢీకొనడంతో తీవ్రంగా గాయపడిన వ్యక్తి ఆస్పత్రిలో చికిత్స పొందుతూ ఆదివారం మృతి చెందారు. పోలీసుల వివరాల మేరకు.. మండలంలోని బద్దెవోలు క్రాస్‌రోడ్డు వద్ద 60 ఏళ్ల వ్యక్తి రోడ్డు దాటుతుండగా నెల్లూరు వైపు నుంచి గూడూరు వైపు వెళ్తున్న వాహనం ఢీకొంది. ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన ఆయన్ను చికిత్స నిమిత్తం నెల్లూరు ప్రభుత్వాస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందారు. మృతుడి వివరాలు తెలియరాలేదు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

## వేళాంగణి చర్చిలో ప్రార్థనలు



తోటపల్లిగూడూరు: కోడూరులోని వేళాంగణి చర్చిలో స్వస్థత ప్రార్థనలను ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా దైవ సందేశాన్ని చర్చి ఫాదర్ లోకస్‌రాజ్ అందించారు. ప్రార్థనలకు భక్తులు విశేషంగా హాజరయ్యారు. అనంతరం స్థానికంగా ఉన్న కోడూరు తీరంలో సముద్ర స్నానాలను ఆచరించి మొక్కలను చెల్లించుకున్నారు. ఉదయం పది గంటలకు ప్రారంభమైన ప్రత్యేక ప్రార్థనలు మధ్యాహ్నం ఒంటి గంట వరకు జరిగాయి.

## మోహన్‌రావు సేవలు చిరస్మరణీయం



మోహన్‌రావు దంపతులకు సన్మానం

కోవూరు: మండలంలోని పడుగుపాడు ఎంపీయూపీ పాఠశాలలో ప్రధానోపాధ్యాయుడిగా పనిచేసిన మోహన్‌రావు సేవలు చిరస్మరణీయమని పలువురు పేర్కొన్నారు. ఆయన ఉద్యోగ విరమణ పొందిన సందర్భంగా పాఠశాలలో ఆదివారం ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా అతిథులు మాట్లాడారు. పాఠశాలను అభివృద్ధి పథంలో నడిపించారని కొనియాడారు. అనంతరం మోహన్‌రావు దంపతులను సత్కరించారు.

## నేత్ర వ్యాధులపై అవగాహన అవసరం



మాట్లాడుతున్న రాజేంద్రరెడ్డి

నెల్లూరు(అర్బన్): నేత్ర వ్యాధులపై పూర్తిస్థాయిలో అవగాహన కలిగి.. తగు జాగ్రత్తలను పాటించడం ద్వారా ఎలాంటి సమస్యలు దరిచేరవని నేత్ర నిపుణుడు బీరం రాజేంద్రరెడ్డి పేర్కొన్నారు. కమ్యూనిటీ పారామెడిక్స్ అండ్ ప్రైమరీ హెల్త్ కేర్ ప్రొవైడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యులకు అవగాహన సదస్సును విజయమహల్ గేట్ సమీపంలోని ఎమ్సీఎస్ కల్యాణ మండపంలో స్మార్ట్ విజన్ ఐ ఆస్పత్రి, లేజర్ సెంటర్ సహకారంతో ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. నేత్ర సమస్యలు, ఆధునిక వైద్య విధానాలపై పీఎంపీలు పూర్తి స్థాయిలో అవగాహన పెంచుకోవాలని సూచించారు. జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ సర్వైలెన్స్ ఆఫీసర్ డాక్టర్ భాస్కర్, పీహెచ్‌పీ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు శాఖవరపు వేణుగోపాల్, గౌరవాధ్యక్షుడు జయప్రకాష్, నారాయణ వైద్యశాల ఏజీఎం భాస్కర్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి గోరంట్ల శేషయ్య, న్యాయ సలహాదారు రమాదేవి, దేవరకొండ శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

## ప్రణాళికబద్ధంగా పింఛన్ల పంపిణీ

నెల్లూరు(బారకాసు): నగరపాలక సంస్థ పరిధిలోని అన్ని డివిజన్లలో ఇంటింటికీ వెళ్లి లబ్ధిదారులకు ఎన్టీఆర్ భరోసా పింఛన్లను పంపిణీ చేయాలని కమిషనర్ వికాస్ మర్మత్ ఆదివారం ఒక ప్రకటనలో ఆదేశించారు. కార్పొరేషన్ పరిధిలోని 165 సచివాలయాల్లో గల లబ్ధిదారులకు పింఛన్ల పంపిణీ ప్రక్రియను పర్యవేక్షించేందుకు గానూ 27 మంది నోడల్ అధికారులను నియమించామని చెప్పారు. పింఛన్ల పంపిణీని సోమవారం ఉదయం ఆరు గంటలకు ప్రారంభించి రాత్రి ఏడులోపు పూర్తి చేయాలని సూచించారు. పంపిణీ ప్రక్రియను మంగళవారం నాటికి నూరు శాతం పూర్తి చేయాలని కోరారు.

- నగరపాలక సంస్థ కార్యాలయంలో ప్రజల నుంచి అర్జీలను సోమవారం స్వీకరించనున్నామని కమిషనర్ వికాస్ మర్మత్ తెలిపారు. ఉదయం పది నుంచి మధ్యాహ్నం వరకు నిర్వహించనున్న కార్యక్రమంలో అన్ని విభాగాధిపతులు, అధికారులు పాల్గొననున్నారని చెప్పారు.

**డయేరియాపై నేటి నుంచి ఇంటింటి సర్వే**

డయేరియా నిర్ధారణను సంబంధించిన ఇంటింటి సర్వేను సోమవారం నుంచి నిర్వహించనున్నామని కమిషనర్ వికాస్ మర్మత్ తెలిపారు. గడప గడపకూ వెళ్లి డయేరియా నివారణ జాగ్రత్తలు – తాగునీటి శుభ్రతపై ప్రజలకు అవగాహన కల్పించనున్నామని వివరించారు. డయేరియా లక్షణాలను గుర్తించిన ప్రాంతాల్లో తాగునీటి ప్రమాణాలను పరీక్షించనున్నామని చెప్పారు. వాటర్ ట్యాంకులను 15 రోజులకోసారి శుభ్రం చేసేలా చర్యలు చేపట్టనున్నామని పేర్కొన్నారు.

## నిత్యావసర సరుకుల అందజేత



నెల్లూరు(వీఆర్సీసెంటర్): నగరంలోని ప్రగతి చారిటబుల్ ట్రస్ట్‌కు నిత్యావసర సరుకులను సీమాంధ్ర బీసీ సంక్షేమ సంఘ సేవా కమిటీ ఆధ్వర్యంలో ఆదివారం అందజేశారు. ఈ సందర్భంగా సేవా కమిటీ రాష్ట్ర అధ్యక్షుడు ఉల్లిపాయల శంకరయ్య మాట్లాడారు. పలు సేవా కార్యక్రమాలను తాము నిర్వహిస్తున్నామని చెప్పారు. లీలాకృష్ణయాదవ్, మాధవరావు, ప్రభాకర్‌రాజు, విజయ్‌కుమార్, మురళి, వెంగబాబు, మనోహర్, రవి, అంకయ్య తదితరులు పాల్గొన్నారు.

## ఆర్టీసీ ఆర్‌ఎంకు ఘన సన్మానం



నెల్లూరు సిటీ: ఆర్టీసీ రీజినల్ మేనేజర్ శేషయ్య ఉద్యోగ విరమణ కార్యక్రమాన్ని నగరంలోని ఆర్టీసీ కాన్ఫరెన్స్ హాల్లో ఏపీపీటీడీ వైఎస్సార్ ఎంప్లాయీస్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన్ను ఘనంగా సత్కరించారు. అనంతరం శేషయ్య మాట్లాడారు. నెల్లూరులో మూడేళ్ల పాటు తాను పనిచేశానని చెప్పారు. ఉద్యోగుల సహకారంతో విధులను విజయవంతంగా నిర్వర్తించగలిగానని చెప్పారు. అసోసియేషన్ రాష్ట్ర జాయింట్ సెక్రటరీ, జిల్లా అధ్యక్షుడు కేపీ రెడ్డి అధ్యక్షతన నిర్వహించిన కార్యక్రమంలో నెల్లూరు ఒకటో డిపో అధ్యక్షుడు వెంకటేశ్వర్లు, సెక్రటరీ ప్రకాష్, జిల్లా అసోసియేషన్ ముఖ్యసలహాదారు రమేష్‌బాబు, రెండో డిపో అధ్యక్షుడు హరికిషోర్ రెడ్డి, సెక్రటరీ సురేష్, కావలి, కందుకూరు డిపో అధ్యక్షులు నారపరెడ్డి, నారాయణరావు, సెక్రటరీ శ్రీనివాసరావు, సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

- నెల్లూరు ఒకటో డిపో పరిధిలో కండక్టర్‌గా పనిచేస్తున్న సుబ్బయ్య, అసిస్టెంట్ మెకానిక్ బాలయ్య ఉద్యోగ విరమణ పొందారు. ఈ క్రమంలో వీరిని సత్కరించారు.

### ఆర్చరీ క్రీడాకారులకు అభినందన



నెల్లూరు (స్టోన్‌హౌస్‌పేట): విజయవాడలో ఇటీవల నిర్వహించిన ఆర్చరీ పోటీల్లో జిల్లాకు చెందిన క్రీడాకారులు 12 పతకాలను సాధించారు. ఈ క్రమంలో ఆదిత్యనగర్‌లోని ఎస్పీ బాలసుబ్రహ్మణ్యం మున్సిపల్ పార్క్‌లో ఆదివారం నిర్వహించిన కార్యక్రమంలో వీరిని సత్కరించారు. అనంతరం ఆర్చరీ అసోసియేషన్ జిల్లా కార్యదర్శి పావురాల వేణు మాట్లాడారు. టోర్నీలో జిల్లా క్రీడాకారులు అత్యుత్తమ ప్రతిభ చూపి 12 ఈవెంట్లలో జాతీయ స్థాయి పోటీలకు అర్హత సాధించడాన్ని అభినందించారు. యతిరాజ్, ఒలింపిక్ అసోసియేషన్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు ఆనం మహేశ్వర్‌రెడ్డి, గురుప్రసాద్, సీనియర్ వ్యాయామ ఉపాధ్యాయులు గాదం శ్రీనివాసులు, అరిగెల విజయ్‌కుమార్, వెంకటేశ్వర్లు, శ్రీనివాసులు, జేడీ సుందర్‌రావు, జిలానీబాషా, భరద్వాజరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

### క్రమబద్ధీకరణను వేగవంతం చేయాలని వినతి

నెల్లూరు (టౌన్): ఎన్నికల కోడ్ కారణంగా గతంలో నిలిచిపోయిన కాంట్రాక్ట్ అధ్యాపకుల క్రమబద్ధీకరణ ప్రక్రియను ప్రస్తుతం వేగవంతం చేయాలని ప్రభుత్వ కాంట్రాక్ట్ లెక్చరర్స్ జేఏసీ చైర్మన్ సురేష్, కో చైర్మన్ శ్రీనివాసులు కోరారు. ఈ మేరకు మంగళగిరిలో సీఎం చంద్రబాబును మర్యాదపూర్వకంగా కలిసి వినతిపత్రాన్ని అందజేశారు.

## ప్రగతి చారిటీస్‌కు విరాళం



చెక్కును అందజేస్తున్న వేమిరెడ్డి దంపతులు

నెల్లూరు(దర్గామిట్ట): నగరంలోని ప్రగతి చారిటీస్‌కు రూ.మూడు లక్షల విరాళాన్ని ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, కోవూరు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి ఆదివారం అందజేశారు. నగరంలోని వీపీఆర్ నివాసంలో ఈ మొత్తానికి సంబంధించిన చెక్కును చారిటీస్ ఇన్‌చార్జి సుభాష్ అందుకున్నారు. అనంతరం వేమిరెడ్డి దంపతులకు గులాబీ పూలను చిన్నారులు అందజేసి కృతజ్ఞతలు తెలిపారు.